## మేడే రోజునా తప్పని పని



పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

హాజీపూర్, మే 1 : మేడే రోజున సైతం ఉపాధి హామీ కూలీలకు పని తప్పలేదు. గురువారం దేశ వ్యాప్తంగా కార్మిక దినోత్సవం నిర్వహించుకుంటున్న వేళ కార్మికులు పని చేయకూడదని ప్రభుత్వం సెలవు దినం ప్రకటించింది. అయినా మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలంలో ని పెద్దంపేట గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ కార్మికులతో ఫీల్డ్ అస్టిటెంట్ పని చేయించారు. ఉపాధి హామీ పనులను కొనసాగించడంతో కార్మిక సంఘాల నాయకులు మండి పడుతున్నారు. ఈ విషయంపై ఏపీవోను ఫోన్‌లో సంప్రదించగా ఎటువంటి ఉపాధి హామీ పనులను ఎవరితో చేయించలేదని తెలిపారు.

## ట్రెయినీ సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు అంతిమ వీడ్కోలు



గౌరవ వందనం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు, డీసీపీ రాకేశ్ సాబ్ దెహరియా

భీమారం, మే 1: భీమారం మండల కేంద్రానికి చెందిన రామల్ల సాగర్ ట్రెయినీ జవాన్ మంచిర్యాలలో బుధవారం గుండె పోటుతో మృతి చెందగా గురువారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. హైదరాబాద్ (రంగారెడ్డి) జీసీ గ్రౌండ్ డీఎస్‌పీ రాకేశ్ సాబ్ దెహరియా ఆధ్వర్యంలో పోలీసులు సాగర్ మృతదేహానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబానికి సహాయంగా రూ.10 లక్షల చెక్కుతోపాటు తక్షణ సహాయంగా రూ.75 వేలు అందించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మంచిర్యాల (ఏసీసీ), మే1: యూపీఎస్సీ పరీక్షల కోసం 2025-26 విద్యా సంవత్సరానికి తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వంద మంది మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కోసం రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని తెలిపారు. మొదటి సారి ప్రవేశం పొందే అభ్యర్థులుప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, మెరిట్ ప్రతిపాదికన ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 24 లోగా అప్లై చేసుకోవాలని, జూన్ 5న జిల్లా కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మైనారిటీ అభ్యర్థులు సద్వినియోగం చూసుకోవాలని సూచించారు.

## రేషన్ బియ్యం విక్రయిస్తే కార్డు రద్దు చేస్తాం

నస్పూర్, మే 1 : అర్హులైన నిరుపేద ప్రజలకు ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నదని, ఈ బియ్యం విక్రయిస్తే రేషన్ కార్డు రద్దు చేస్తామని అదనపు కలెక్టర్ మోతీలాల్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలోని తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన 11 మంది రేషన్ కార్డు దారులు సన్న బియ్యాన్ని విక్రయించిన సమాచారం మేరకు సంబంధిత లబ్ధిదారుల రేషన్ కార్డులు రద్దు చేశామన్నారు. 11 మంది అచ్చలాపూర్ గ్రామానికి చెందిన కుంకుమొట్టి మహేశ్‌కు బియ్యం విక్రయించారనే సమాచారంతో అతడి నివాసంలో తనిఖీలు చేయగా సన్నబియ్యం దొరికిందన్నారు. దీంతో వారి రేషన్‌కార్డులు రద్దు చేశామని తెలిపారు. రేషన్ సన్నబియ్యం విక్రయించే వారి కార్డులను రద్దు చేస్తామని పేర్కొన్నారు.

## పోలీస్ ఆంక్షలు పొడిగింపు

మంచిర్యాల అర్బన్, మే 1: రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, డీజే, డ్రోన్ల వినియోగంపై ఉన్న ఆంక్షలను మే 1 నుంచి జూన్ 1 వరకు పొడిగిస్తున్నట్లు రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. అలాగే కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు.

## 4న ఉచిత మెగా మెడికల్ క్యాంపు

శ్రీరాంపూర్, మే 1: ఈనెల 4న ఆదివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మల్టీస్పెషాలిటీ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మెగా మెడికల్ క్యాంపుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను జీఎం శ్రీనివాస్, డీవైజీఎం అరవిందరావు విడుదల చేశారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో కరీంనగర్ రెనె దవాఖాన సౌజన్యంతో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమని జీఎం పేర్కొన్నారు. ప్రజలు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు భాస్కరి రాజేశం, క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ కోడం రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి క్యాతం రాజేశ్, కోశాధికారి నారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులు తలారి సమ్మయ్య పాల్గొన్నారు.

## పోయిన పర్సు అందజేత

మంచిర్యాల (ఏసీసీ), మే 1: బస్సులో పోయిన పర్సును కండక్టర్ ప్రయాణికురాలికి అందజేశాడు. గురువారం ఉదయం నాలుగు గంటలకు మంచిర్యాల నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సు నం. (టీఎస్19టీ9608) గోదావరిఖనికి వచ్చే సరికి 70 మంది ప్రయాణికులున్నారు. ఆ స్టేషన్‌లో హడావిడిగా ఒక మహిళ బస్సు ఎక్కి, రద్దీ ఎక్కువగా ఉండడంతో తిరిగి బస్సు దిగి వెళ్లిపోయింది. ఈ క్రమంలో తన పర్సును బస్సులో జారవిడుచుకుంది. బస్టాండ్ నుంచి బయలు దేరిన తర్వాత బస్సులో ఒక పర్స్ కండక్టర్ వీబీ రావుకు దొరికింది. దాన్ని తెరిచి చూడగా, అందులో 10 వేల వరకు డబ్బు, బ్యాంక్ పాస్ బుక్, రెండు సెల్ ఫోన్లు ఉన్నాయి. పాస్ బుక్ లోని వివరాల ద్వారా ఎంక్వైరీ చేయగా, సదరు ప్రయాణికురాలు గోదావరిఖనికి చెందిన నడిపెల్లి రమాదేవి అని తేలింది. దీంతో ఆమె వచ్చేవరకు బస్సును మార్గమధ్యంలో నిలిపి, ఆమె రాగానే వివరాలు పోల్చుకుని, ప్రయాణికులు ముందు సదరు బ్యాగును కండక్టర్ అందజేశారు. దీంతో ఆమె కండక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపింది.



బెల్లంపల్లి : సింగరేణి ఏరియా దవాఖాన ఆవరణలో జెండా ఎగురవేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు



రెబ్బెన : గోలేటి టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు




కాగజ్‌నగర్ : సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

# ఘనంగా మేడే వేడుకలు



శ్రీరాంపూర్ : ఎస్ఆర్పీ 1గనిపై జెండా ఆవిష్కరిస్తున్న టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి

మేడే వేడుకలను గురువారం జిల్లాలో ఆయా రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకుల ఘనంగా జరుపుకున్నారు. అన్ని యూనియన్‌ల కార్యాలయాలు, సింగరేణి బొగ్గు గనులు, విభాగాల్లో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పతాకాలను ఆవిష్కరించారు. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో పతాకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. మే డే స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమిస్తామని ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ జాగృతి జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన వేడుకలకు టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఎస్ఆర్పీ 1 గని సీనియర్ నాయకుడు వికాస్ ఆధ్వర్యంలో కార్మికులు తరలివెళ్లారు. అన్ని రంగాల కార్మికులను ఎమ్మెల్సీ కవిత సన్మానించి సత్కరించారు.

-నమస్తే నెట్‌వర్క్, మే 1




మందమర్రి : టీబీజీకేఎస్ కార్యాలయం ఎదుట పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

## ధాన్యం కొనుగోళ్లు సమర్థవంతంగా నిర్వహించాలి



మామిడిపెల్లిలో నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్

దండేపల్లి, మే1: ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం దండేపల్లి మండల కేంద్రంతోపాటు ముత్యంపేట, నెల్కివెంకటాపూర్, పాతమామిడిపెల్లి, వెల్గనూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు సందర్శించారు. అనంతరం ధర్మరావుపేటలో కొనసాతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారమే నాణ్యమైన వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేంచంద్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, అధికారులున్నారు.

## అక్రమ రోడ్డు నిర్మాణంపై చర్యలు తీసుకోండి

మంచిర్యాల (ఏసీసీ), మే 1: నగరంలోని హైటెక్ సిటీ కాలనీలో చేపట్టిన అక్రమంగా రోడ్డు నిర్మించారని కాలనీవాసులు గురువారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కాలనీలోని ఎంట్రన్స్ వద్ద నుంచి 100 ఫీట్ల రోడ్డు లే ఔట్ ప్రకారం ఏషియన్ టవర్స్ వరకు మాత్రమే హద్దు ఉందని గుర్తు చేశారు. కొంతకాలం కిందట సరిహద్దు రాళ్లు తొలగించి, అక్రమ రోడ్డు నిర్మాణం చేశారని పేర్కొన్నారు. మున్సిపల్ నిబంధనలకు వ్యతిరేకంగా ఈ నిర్మాణం చేశారని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రోడ్డుతో తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని, దీనిపై తమ కా లనీ కమిటీ సరిగా స్పందించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు సురభి రవి కుమార్, రమేశ్, భీమయ్య తదిరతులు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం

- నేలకొరిగిన వరి పంట
- రాలిపోయిన మామిడికాయలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం



నెన్నెల : గంగారం గ్రామంలో ఈదురుగాలులకు ధ్వంసమైన కోళ్లఫాం



భీమారం : దాంపూర్‌లో నేల రాలిన మామిడికాయలను చూపిస్తున్న రైతు రామయ్య

నెన్నెల/ భీమారం/చెన్నూర్‌రూరల్, మే 1 :మంచిర్యాల జిల్లాలో బుధవారం రాత్రి ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వాన బీభత్సం సృష్టించింది. బుధవారం సాయంత్రం కొన్ని గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది. రాత్రి మళ్లీ కురవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. గంగారం గ్రామంలో ఈదురుగాలులకు కోళ్లఫాం పూర్తిగా నేల మట్టమైంది. గుండ్లసోమారం గ్రామంలో దాదాపు పది ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడడంతో స్తంభాలు కూలిపోయాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. చేతికి వచ్చిన వరి పంట నేలకొరిగి దెబ్బతినడంతో కోసేందుకు ఇబ్బందిగా మారింది. కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో వడ్లు తడిసిపోయాయి.

### భీమారం మండలంలో..

భీమారం మండలంలోని దాంపూర్‌లో కందుల లింగయ్యకు చెందిన మామిడి తోటలో కాయలు రాలి తీవ్ర నష్టం వాటిల్లింది. రెడ్డిపల్లి, ధర్మారం, ఖాజీపల్లి, భీమారంలో మామిడితోటలు దెబ్బతిన్నాయి. దాంపూర్‌లో ఇండ్లపై కప్పు రేకులు ఎగిరిపడ్డాయి. చెట్ల కొమ్మలు రోడ్లకు అడ్డంగా విరిగి పడ్డాయి. రెడ్డిపల్లి, వెల్లపల్లి, బూర్గుపల్లి పరిధిలో మామిడి తోటలను, వరి పొలాలను హార్టికల్చర్ అధికారి కల్యాణి, మండల వ్యవశాయ శాఖ అధికారి అత్తే సుధాకర్ పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేయనున్నట్లు వారు తెలిపారు. చెన్నూర్ మండలంలో సుద్దాల, లంబాడీపల్లె, కన్నేపల్లి, సంకారం, బుద్ధారం, అంగ్రాజ్‌పల్లి, కిష్టంపేట, లింగంపల్లి తదితర గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. పలుచోట్ల మామిడి చెట్లు విరిగి పడ్డాయి. అధికారులు స్పందించి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఈదురుగాలులు, వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలపై సర్వే చేసి నష్ట పోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీఆర్ఎస్ నెన్నెల మండల అధ్యక్షుడు పంజాల సాగర్ గౌడ్ కోరారు. మామిడి రైతులు తీవ్రంగా నష్ట పోయారని ఉన్న కాస్త పంటనైనా అమ్ముకుందామనుకుంటే గాలి వాన వచ్చి చేతికి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో వరి, మామిడి రైతులను ఆదుకోవాలన్నారు.

-బీఆర్ఎస్ నెన్నెల మండల అధ్యక్షుడు పంజాల సాగర్‌గౌడ్

# 'దివాకరన్న పెరుగన్నం' ప్రారంభం



దివాకరన్న పెరుగన్నం పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, విజిత్‌రావు

మంచిర్యాలటౌన్, మే 1: ఎండాకాలంలో మంచిర్యాల పట్టణంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, బాటసారులకు వేసవి తాపాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రతి ఏటా అందించే 'దివాకరన్న పెరుగన్నం' పంపిణీ కార్యక్రమాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రయాణికులు, నిరుపేదలు, బాటసారుల దాహం, ఆకలి తీర్చేందు కోసం ప్రతి సంవత్సరం దివాకరన్న పెరుగన్నం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎండాకాలం పూర్తయ్యే వరకు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, నాయకులు గాదె సత్యం, అక్కూరి సుబ్బయ్య, సురేందర్‌రెడ్డి, శ్రీరాముల మల్లేశ్, జూపాక సుధీర్, పడాల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు



రామరావుపేట శివారులో మట్టి తవ్వకాలతో ఏర్పడ్డ గుంతలు

జైపూర్, మే 1: మండలంలోని రామరావుపేట శివారు వ్యవసాయ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతం మొత్తం ఇందారం ఓపెన్‌కాస్టు ఓబీ మట్టి డంపులకు గాను సింగరేణి సేకరిస్తుండగా ఇప్పటికే సర్వే మొత్తం పూర్తయ్యింది. ఎలాగూ సింగరేణిలో భూమి ముంపునకు గురవుతుండడంతో రైతులు తమ వ్యవసాయ భూములనుంచి మట్టి అమ్మకాలు చేపడుతుండగా మట్టి అక్రమ రవాణాదారులు దీన్ని సొమ్ము చేసుకుని రాత్రి పగలు లేకుండా జేసీబీతో మటి తవ్వకాలు చేస్తున్నారు. ఇక్కడనుంచి మంచిర్యాల, సీసీసీ, నస్పూర్ తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటువైపు రెవెన్యూ అధికారులు గాని, మైనింగ్ అధికారులు కాని కన్నెత్తి చూడకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మట్టి తవ్వకాలు నిలిపివేయాలని స్థానికులు కోరుతున్నారు.

## కార్యదర్శులతో సమీక్ష సమావేశం

మందమర్రిరూరల్ , మే 1 : మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఎంపీడీవో రాజేశ్వర్ పలు సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సర్వే చేశారని, అర్హులకు అందేలా చూడాలని స్పష్టం చేశారు. తాగునీరు, డ్రైనేజీ, శానిటేషన్, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

బెల్లంపల్లి, మే 1: మండలంలోని పెరకపల్లి గ్రామంలో ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామ రైతులు కోరుతున్నారు. గ్రామ పరిధిలో యాసంగి పంటలు కోతకు వచ్చి ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ కుమార్‌దీపక్ స్పందించి సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి తమకు న్యాయం చేయాలని తెలిపారు.

## ఐఎన్‌టీయూసీ నాయకునికి శ్రమశక్తి అవార్డు

మందమర్రి మే 1: సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే ఐదు గనిలో అసిస్టెంట్ చైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంశెట్టి నరేందర్ శ్రమశక్తి అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన మేడే వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రుల అవార్డును ప్రదానం చేశారు.

## విద్యార్థుల కోసం వేసవి శిబిరాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 1 : వేసవిలో విద్యతో కళలు, చిత్రలేఖనం, పెయింటింగ్‌లో విద్యార్థులకు శిక్షణ అందించేందుకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో డీఈవో యాదయ్యతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో కళలు, చిత్రలేఖనం, పెయింటింగ్, క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని, శారీరక, మానసిక ఎదుగుదలకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. 15 రోజుల పాటు శిబిరాలు నిర్వహించాలని, ఒక్కో శిబిరానికి రూ.50 వేల నిధులు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి శిబిరంలో వంద మంది విద్యార్థులకు శిక్షణ అందించాలన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## అనర్హులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్

మందమర్రి, మే 1: క్యాతనపల్లి మున్సిపాలిటీలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు చోటు చేసుకున్నాయని, అనర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేశారని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్ ఆరోపించారు. రామకృష్ణాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేద వారికి కాకుండా ఇండ్లు ఉన్నవారు, కాంగ్రెస్ కార్యకర్తలను అర్హులుగా ఎంపిక చేశారని అన్నారు. అర్హులకు ఇండ్లను కేటాయించకపోతే నిరుపేద కుటుంబాలతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కంభగోని సుదర్శన్ గౌడ్, రామిడి కుమార్, బడికెల సంపత్, రేవెళ్లి ఓదెలు, జిలుకర మహేశ్, పారుపల్లి తిరుపతి, గడ్డం రాజు, బొమ్మ భూమయ్య గౌడ్, నందిపేట సదానందం, సత్యనారాయణ, శ్రీనివాస్, చంద్రమౌళి, రాజు, సంతోశ్, రామిడి లక్ష్మీకాంత్, దేవి సాయి, మహిళా నాయకురాలు అమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కార్యకర్త కుటుంబానికి పరామర్శ

రెబ్బెన, మే 1: రెబ్బెన మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ మహిళా కార్యకర్త పిల్లి సుగుణదేవి సంవత్సరీకానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరై నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కుందారపు శంకరమ్మ, మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, పట్టణాధ్యక్షుడు రాపర్తి అశోక్, మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, మాజీ ఉపసర్పంచ్ బోమ్మినేని శ్రీధర్, మాజీ వార్డు సభ్యుడు దుర్గం భరద్వాజ్, బీఆర్ఎస్ నాయకులు వరలక్ష్మి, వినోద్‌జైస్వాల్, జుమ్మిడి అనందరావు ఉన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

పెంచికల్ పేట్, మే 1 : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరిబాబు అన్నారు. బుధవారం ధాన్యం కొనుగోళ్లకు ఎదురుచూపులు అనే కథనాన్ని నమస్తే తెలంగాణ ప్రచురించింది. దీనికి స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు ఐకేపీ ఆధ్వర్యంలో గురువారం వరి కొనుగోలు కేంద్రాలను సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ మద్దతు ధర పొందడానికి వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో వెంకటేశ్వర్,ఎంపీడీవో అల్బర్ట్, ఏపీఎం కోనయ్య, ఏఎస్ఐ ప్రభాకర్,ఏవో మనీషా, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## రెస్క్యూ బృందం సేవలు మరువలేనివి

మందమర్రి, మే 1: సింగరేణి రెస్క్యూ బృందం సభ్యుల సేవలు మరువలేనివని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. మేడే వేడుకలను పురస్కరించుకుని మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గత నెల 22న నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో సహాక చర్యల్లో పాల్గొన్న సింగరేణి మందమర్రి ఏరియా రెస్క్యూ బందం సభ్యులు రెడ్డి శ్రీనివాస్, సానబోయిన శ్రీనివాస్‌ను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## తలరాతను మార్చేది విద్య ఒక్కటే

దహెగాం,మే 1 : మనిషి యొక్క తల రాతను మార్చేది విద్య ఒక్కటేనని ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని అటవీ ప్రాంత మారుమూల మెట్లగూడ గ్రామంలో 'అందరూ చదవాలి అందరూ ఎదగాలి' కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులైన వారికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందస్తు బడిబాట, విద్యా ప్రాముఖ్యత, బాల్యవివాహాల నిరోధించడం, బాల కార్మిక నిర్మూలన, మద్యపాన నిషేధం, కోట్ల వినియోగం, వన్యప్రాణ్లను రక్షించుట తదితర అంశాల మీద గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులతో అక్షరాలు దిద్దించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆదాయం

దహెగాం, మే 1 : ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లాభసాటి ఆదాయం చేకూరుతుందని సీఈవో ఉదయ్ కుమార్ అన్నారు. మండలంలోని గిరివెల్లి గ్రామంలో రైతులకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పంట మార్పిడి పద్ధతిని అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆయిల్ పామ్ పంట సాగుపై ప్రభుత్వం సబ్సిడీ కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో సుస్మిత్, ఎఫ్ఈ ధనుంజయ్ రైతులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయం తనిఖీ

కాసిపేట, మే 1 : కాసిపేట మండల పరిషత్ కార్యాలయాన్ని మండల ప్రత్యేకాధికారి పురుషోత్తం నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం బుగ్గగూడెంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అక్షరాస్యత కార్యక్రమాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. దేవాపూర్ అచ్యుత్ రావు గూడెంలో నీటి సరఫరాపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ భోజన్న, ఎంపీవో శేఖ్ సఫ్దర్ అలీ, ఏపీఎం వెంకటేశ్, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అచ్యుత్ సాయి తదతరులు పాల్గొన్నారు.

## పట్టణ సీఐగా ప్రేమ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

కాగజ్‌నగర్, మే 1: కాగజ్‌నగర్ పట్టణ సీఐగా ప్రేమ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించిన ఆయనకు కాగజ్‌నగర్ సీఐగా బదిలీ కావడంతో గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు. పట్టణంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటానన్నారు. ఇక్కడ ఎస్ఐ సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

## అభ్యంతరకర పోస్టులు పెడితే చర్యలు

చెన్నూర్ టౌన్, మే 1 : సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని చెన్నూర్ పట్టణ సీఐ దేవేందర్ హెచ్చరించారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకరిని గానీ, ఒక వర్గాన్ని కానీ కించపరిచేలా సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులూ పెట్టవద్దని సూచించారు. వాట్సాప్‌లో అభ్యంతరకర పోస్టులు పెడితే దానికి పూర్తి బాధ్యత గ్రూపు అడ్మిన్ వహించాల్సి ఉంటుందన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో సోషల్ మీడియాలో కొంతమంది ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారని, అడ్మిన్ జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. అభ్యంతరకర పోస్టులు పోస్ట్ చేసినప్పుడు గ్రూపు అడ్మిన్ వాటిని కానీ, పోస్టు చేసిన వారిని కానీ తొలగించాలని చెప్పారు. వ్యక్తిగత సమస్యలను గ్రూపులో పోస్టు చేసి ఇతరులను ఇబ్బందులకు గురిచేయవద్దని, కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



చౌపన్‌గూడలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మధూకర్

కెరమెరి, మే 1: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కెరమెరి ఎస్ఐ మధుకర్ అన్నారు. గురువారం మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాటరి వచ్చిందని, ఏదేదో మాయమాటాలు చెప్తే నమ్మవద్దని సూచించారు. ఈ సందర్భంగా యువతకు వాలీబాల్ కిట్‌ను అందజేసి మంచి మార్గంలో నడవాలని, అకౌంట్ నంబర్ పిన్ కోడ్ ఎవ్వరికి చెప్పవద్దని ఆయన తెలిపారు.